క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్యాన్నదానానికి ఓ దాత బుధవారం నగదు విరాళం చేశారు. విశాఖపట్నంకు చెందిన దాత శ్రీకాంత్ రూ.లక్ష నగదును ఆలయానికి విరాళంగా ఇచ్చారు. ఈఓ పెంచల కిషోర్‌ను ఈవిరాళం అందజేయగా అనంతరం దాత కుటుంబానికి ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు. అలాగే అమరరాజా కంపెనీ ఉద్యోగులు ఇన్వర్టర్, బ్యాటరీని విరాళంగా ఇచ్చారు.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు



ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని కట్టమంచిలో రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కట్టమంచి బ్రిడ్జి నుంచి కలెక్టరేట్ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును వంద అడుగులకు విస్తరించడానికి అధికారులు పనులు చేపట్టారు. అయితే పలువురు భవన యజమానులను ఒప్పిస్తున్న మున్సిపల్ అధికారులు.. ఎలాంటి పరిహారం లేకుండానే పలు భవనాలను తొలగించి, రోడ్డు విస్తరణకు స్థలాన్ని సేకరిస్తున్నారు. బుధవారం కూడా కట్టమంచిలో ఓ భవన యజమాని అంగీకారంతో వంద అడుగుల వరకు స్థలాన్ని సేకరించి, అక్కడున్న భవనాలను తొలగించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర, పట్టణ ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.


చెదలు పట్టిన విద్యార్థుల రికార్డులు



చిత్తుకాగితాలను తలపిస్తున్న అడ్మిషన్ రిజిస్టర్

చౌడేపల్లె: ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు సంబంధించిన అడ్మిషన్ రికార్డులకు చెదలుపట్టిన విషయం చారాల ఉన్నత పాఠశాలలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పెద్దపంజాణి మండలం మల్లసముద్రం గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి 2000లో పదో తరగతి చదివాడు. అతనికి స్టడీ సర్టిఫికెట్ అవసరం ఏర్పడడంతో పాఠశాలకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో రికార్డులను పరిశీలించగా చెదలుపట్టి చిత్తు కాగితాలుగా మారినట్టు గుర్తించారు. చివరకు అడ్మిషన్ రిజిస్టర్‌లో శ్రీకాంత్‌రెడ్డి పేరు కనిపించడంతో హెచ్‌ఎం రేణుక స్టడీ సర్టిఫికెట్ జారీ చేశారు. అడ్మిషన్ రికార్డులకు చెదలు పట్టడంపై హెచ్‌ఎం వివరణ ఇస్తూ తాను ఇటీవల పదోన్నతిపై ఈ పాఠశాలకు వచ్చానని తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు రికార్డులను సక్రమంగా భద్రపరచకపోవడంతోనే ఇలా జరిగిందని తెలిపారు. జిల్లా అధికారులతో చర్చించి జిల్లా కార్యాలయంలో ఉన్న రికార్డుల ఆధారంగా కొత్త రికార్డులను సిద్ధం చేస్తామని పేర్కొన్నారు.

వైభవంగా ఆణివార ఆస్థానం



శ్రీవేణుగోపాలస్వామికి ఆణివార ఆస్థానం నిర్వహిస్తున్న వేదపండితులు

కార్వేటినగరం: స్థానిక శ్రీసంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం ఆణివార శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత స్వామివారిని సుప్రభాత సేవతో వేదపండితులు మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన..ఇత్యాది నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం టీటీడీ ఆనవాయితీ ప్రకారం స్వామివారికి వెండితో తయారు చేసిన ఈగల దండ(ఆణివారి మాల)తో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, వేద పండితులు శబరీష్, రమేష్, గోపాలచారి, షరాబ్ బాబు సురేష్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి చాముండేశ్వరిదేవి ఉత్సవాలు

పుంగనూరు: పట్టణంలోని తూర్పుమొగసాలలో వెలసిన చాముండేశ్వరిదేవి ఆలయంలో గురువారం నుంచి ఈ నెల 25 వరకు అమ్మవారి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు జెట్టి కులస్తులు తెలిపారు. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తామని పేర్కొన్నారు. అమ్మవారిని ఊరేగిస్తామని తెలిపారు. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని జెట్టి కుల సంఘం ప్రతినిధులు కోరారు.

ధైవ సత్రమా.. సర్కారు కార్యాలయమా?

సంతపేటలో నిర్మిస్తున్న నూతన భవనం



ఆ స్థలం ఒకప్పుడు సేవాసత్రం. శ్రీపురం ట్రస్టు పేరుతో విరాజిల్లింది. రానురాను ఆ స్థలం అన్యాక్రాంతం అవుతూ వచ్చింది. చివరకు శ్రీపురం సత్రం సభ్యుల పట్టుతో ఆ స్థలం దేవదాయశాఖకు చేరింది. ఈ స్థలంలో ఆ శాఖ నూతన భవన నిర్మాణం చేపడుతోంది. తొలుత అందుకు ఫంక్షన్ అని పేరు పెట్టింది. అయితే ప్లానింగ్ మొత్తం ఇప్పుడు కార్యాలయంగా మార్పు దిద్దుకుంటోందని సభ్యులు వాదనకు దిగుతున్నారు. సత్రం ఆశయం మేరకు భవన నిర్మాణం చేయాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

- సంతపేటలోని శ్రీపురం సత్రస్థలంలో నూతన భవన నిర్మాణం
- ఫంక్షన్ హాల్ పేరిట నిర్మాణ పనులు
- దేవదాయ శాఖ కార్యాలయం కోసం ఆ శాఖ అధికారుల ప్లానింగ్
- సత్రం ఆశయం మేరకు భవన నిర్మాణం చేయాలని సత్రం సభ్యుల డిమాండ్
- దేవదాయ అధికారుల తీరుపై మండిపాటు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని సంతపేట ప్రాంతంలో వందేళ్లకు ముందు శ్రీపురం వెంకట్రాయుల శెట్టి చారిటబుల్ ట్రస్టు ఏర్పాటైంది. నార్త్ అర్కాట్ డిస్ట్రిక్ ఉన్న సమయంలో రూ.4 స్టాంప్‌పై ఈ ట్రస్టును రిజిస్టర్ చేశారట. ఆ ట్రస్టు పేరిట ఉన్న ఆస్తుల ద్వారా ప్రతినెల రూ.300 ఆదాయం వచ్చేలా చేశారట. ఆ నిధులతో ఆలయాలకు అవసరమైన వాటిని సరఫరా చేయడంతో పాటు, పలు సేవా కార్యక్రమాలు చేపట్టారని స్థానికులు అంటున్నారు.

వివాదం నుంచి దేవదాయశాఖ చేతుల్లోకి..

ఈస్థలం అన్యాక్రాంతానికి గురైందని శ్రీపురం ట్రస్టుకు సంబంధించిన కుటుంబ సభ్యులు రోడ్డెక్కారు. ఆ తర్వాత ఈ స్థలం వివాదానికి తెరలేపింది. రెండు వర్గాలు ఈ స్థలం మాదేనంటూ పట్టుబట్టింది. ఇలా కొన్నాళ్ల పాటు ఈ స్థలంలో వివాదంలో నడిచింది. పోలీసులు, అధికారులు, సభ్యుల సమక్షంలో స్థలం చివరకు దేవదాయశాఖకు దక్కింది.

పక్కా ప్లాన్..

గతేడాది ఈ స్థలంలో ఫంక్షన్ హాల్ కట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్ర శాఖ అనుమతులు తీసుకున్నారు. ఇందుకు గాను దేవదాయశాఖ నుంచి సుమారు రూ.43 లక్షల వరకు నిధులు మంజూరు చేసింది. పైకప్పు రేకుల షెడ్డు వేసేలా ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే తీసుకున్న ప్లానింగ్ ప్రకారం అక్కడ పనులు జరగడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఆ భవనాన్ని కార్యాలయంగా వాడుకునేందుకు సొంత ప్లానింగ్‌తో ముందుకు వెళ్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్లాన్ మారడంతో కార్యాలయానికి రేకులు షెడ్డు ఉంటే బాగుండదని మళ్లీ రూ.7 లక్షలకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.

అవస్థ తప్పదు..

జిల్లా దేవదాయశాఖ కార్యాలయం ప్రస్తుతం చిత్తూరు నగరం చర్చివీధిలోని జీవకారుణ్య సత్రంలో కొనసాగుతోంది. కొన్నేళ్లుగా కార్యకలాపాలు ఇక్కడి నుంచే కొనసాగుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలు దేవదాయశాఖకు సంబంధించిన సమస్యలను చెప్పుకోవడానికి ఈ కార్యాలయం అనుకూలంగా ఉంది. ఇప్పుడు ఈ కార్యాలయాన్ని సంతపేటకు మార్పు చేస్తే ప్రజలకు ఇబ్బంది తప్పదు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కార్యాలయంగా ఎలా మారుస్తారు ?



శ్రీపురం సత్రం ఆశయం మేరకు ఆ స్థలంలో నిర్వహణ జరగాలి. అక్కడ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి అయితే ఒప్పుకుంటాం. లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం. వీళ్ల స్వప్రయోజనాల కోసమే ఈ స్థలాన్ని కార్యాలయంగా మార్చుకునేందుకు చూస్తున్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించాం. జిల్లా యంత్రాంగం కూడా స్పందించాలి.

–రామభద్ర, బ్రాహ్మణ సంఘ సభ్యుడు, చిత్తూరు

రైతు సేవా కేంద్రాల సందర్శన

తవణంపల్లె: మండలంలోని సచివాలయాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సందర్శించారు. బుధవారం మండలంలోని పైమాఘం, అరగొండ, గాజులపల్లె, మల్లకుంట రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ రైతు సేవా కేంద్రాల్లో మామిడి రైతుల వివరాలు తప్పులు తడకగా లేకుండా ఆర్‌ఎస్‌కే సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మామిడి రైతులకు ప్రభుత్వం అందించే కిలో రూ.4 సబ్సిడీ ప్రతి రైతుకు వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. మామిడి రైతులు ఏఏ ఫ్యాక్టరీకి ఎన్ని టన్నుల కాయలు తరలించారు ? రైతుల బ్యాంకు ఖాతా, పాసు పుస్తకాల వివరాలు, క్రాప్ బుకింగ్ చేశారా ? లేదా ? అనే వివరాలను ఆరా తీశారు. రైతులు ఏవైనా సరైన వివరాలు ఇవ్వకపోతే క్షేత్రస్థాయిలో రైతులతో కలసి పూర్తి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో సవరించి నమోదు చేయాలని సూచించారు. గ్రామాల్లో రైతులతో మాట్లాడి సందేహాలను నివృత్తి చేశారు. కలెక్టర్‌తో పాటు జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ సుధాకర్, వ్యవసాయాధికారి ప్రవీణ్, హార్టికల్చర్ అధికారి సాగరిక, ఏఓ రెడ్డిబాబు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

అర్జున తపస్మాన్ రేపు

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలో పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం అర్జున తపస్మాన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సమన్వయంతో పని చేస్తే సత్ఫలితాలు



మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్

ఐరాల: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతాయని, తద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని ఎంపీపీ మోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నందకిషోర్‌కు సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా బోరు మోటార్లు మరమ్మతులకు గురైతే తక్షణం అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడితే తక్షణమే చర్యలు తీసుకుంటామని ఏఈ నందకిషోర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి ద్వారా రుణాలను ఇస్తున్నట్లు ఏపీఎం నాగరత్న తెలిపారు. మండలంలోని పుల్లూరులో రీసర్వే పనులు జరుగుతున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి చెప్పారు. రీసర్వేలో ఎదురువుతున్న సమస్యలు అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. కొన్ని గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నాయని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని నాగంవాండ్లపల్లె సర్పంచ్ శ్రీనివాసులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ట్రాన్స్‌కో ఏఈ నీరజ స్పందిస్తూ ఆయా గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండలంలో 2700 మంది రైతులకు సబ్సిడీ కింద 1303 క్వింటాళ్లు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేసినట్లు ఏఓ వరలక్ష్మి తెలిపారు. 990 మంది రైతుల పొలాల్లో భూసార పరీక్షల నిమిత్తం మట్టి శాంపిల్స్‌ను సేకరించామన్నారు. వాటిని త్వరలో ఆర్‌ఎస్‌కేలో రైతులకు అందజేస్తామని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మండలంలో 6,759 మంది రైతలను అర్హులుగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నిత్య, రోజా, కో–ఆప్షన్ మెంబర్ హారూన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సాధారణం



బదిలీ అయిన ఉపాధ్యాయలను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

బంగారుపాళెం: ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులకు బదిలీ(ట్రాన్స్‌ఫర్స్)లు సర్వసాధారణమని ఎగువరాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగమణి అన్నారు. బుధవారం పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇతర స్కూళ్లకు వెళ్లిన హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు ఇరసయ్య, శారద, శ్రీనివాసులు, రహంతుల్లా, భారతి, ఉషారాణి, రాణి, దశరథను పాఠశాల ఆవరణలో సహోపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో పొలం సారవంతం



రైతులకు నవధాన్యల సాగుపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ హనుమంతరెడ్డి

ఐరాల: రైతులు ఖరీఫ్ సీజన్‌లో పంటపొలాల్లో నవధాన్యాలను వేయడం వల్ల భూమి సారవంతమవడమే కాకుండా జీవవైవిధ్యం పెరుగుతుందని ఏపీ సీఎన్‌ఎఫ్ మాస్టర్ ట్రైనర్ హనుమంతరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఇరువారంపల్లెలో ఏఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతులకు నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ దుక్కులు చేసే సమయంలో నవధాన్యాల విత్తనాలు వేసుకోవడం వల్ల భూసారం పెరుగుతుందని, తద్వారా సాగుచేసే పంటలకు పోషకాలు సమృద్ధిగా అందుతాయని, ఫలితంగా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. బీడు భూముల్లో నవధాన్యాల విత్తనాలు అలసంద, సజ్జ, ఆముదంతో పాటు 24 రకాల జీవ వైవిధ్య పంటలు సాగు చేయాలన్నారు. భూతాపం తగ్గాలన్నా, భూసారం పెరగాలన్నా, తినే ఆహారం ఆరోగ్యాన్ని ఇవ్వాలన్నా రైతులంతా తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. రసాయన ఎరవులను మోతాదు కంటే అధికంగా వాడడం వల్ల భూసారం కోల్పోయి క్రమేపీ పంట దిగుబడి శాతం తగ్గిపోతోందని చెప్పారు. దీనికితోడు ఒకే పంటను సాగు చేస్తుండడంతో పొలాల్లో పోషకాలు అసమతుల్యత ఏర్పడిందని తెలిపారు. ఇటువంటి తరుణంలో నవధాన్యాల పంటలు సాగు భూసారాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర పోషించనున్నాయిని వివరించారు. కార్యక్రమంలో వీఏఏ మురళీకృష్ణ, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తాం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు పెట్టరాదని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. మరోసారి 2024–25 వినియోగంపై రూ.842 కోట్లు సర్దుబాటు చార్జీలను వేయడానికి సిద్ధమైందన్నారు. వీటిపై సదరన్, సెంట్రల్ పంపిణీ సంస్థలు చేసిన తాజా ప్రతిపాదనలను తక్షణం విరమించుకోవాలన్నారు. గత ప్రభుత్వం చేసుకున్న సెకీ ఒప్పందాన్ని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ఒప్పందాన్ని కొనసాగించారన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయడం దుర్మార్గమన్నారు. దీన్ని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వామపక్షాల ఆధ్వర్యంలో దశలవారీగా మరోసారి విద్యుత్ పోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. స్మార్ట్‌మీటర్లు పెడితే జరిగే నష్టాలపై ప్రచారం చేయనున్నమన్నారు. గత సంవత్సరం నుంచి యూనిట్‌కు 40పైసలు చొప్పున వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే పెరిగిన కరెంటు బిల్లుతో నానా అవస్థలు పడుతున్న వినియోగదారులపై మరో రూ.842 కోట్లు సర్దుబాటు చార్జీల భారం మోపే ప్రతిపాదనలు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలసుబ్రమణ్యం, జ్యోతి రావు, జ్యోతి, గోపి, దాసర చంద్ర, మణి, విజయ్ గౌరి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్లో సమస్యల తిష్ట



హాస్టల్‌లో పెచ్చులూడిన దృశ్యం



పాచిపట్టి అధ్వానంగా ఉన్న బాత్‌రూమ్‌లు

గుడిపాల: బాలిక హాస్టల్లో సమస్యలు తిష్ట వేశాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రభుత్వ వసతిగృహంలోని విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. గుడిపాల మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో 20 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వర్షం వచ్చినప్పుడు స్లాబ్ పైన పెచ్చులూడి పడుతున్నాయి. స్లాబ్ ఉరుస్తోంది. దీంతో పెచ్చులు ఎక్కడ మీద పడతాయోనని బాలికలు భయాందోళన చెందుతున్నారు. హాస్టల్‌లో ఫ్యాన్లు కూడా తిరగకపోవడంతో దోమలు దాడి చేస్తున్నాయి. టాయ్‌లెట్లు పాచిపట్టి అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. హాస్టల్ వార్డెన్ అందుబాటులో ఉండడం లేదని స్థానికులు చెబుతున్నారు. విద్యార్థులకు అందించే భోజనం కూడా నాణ్యత ఉండడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ప్రభుత్వ వసతిగృహంలో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హక్కులపై అవగాహన అవసరం



అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పలమనేరు: ప్రతి ఒక్కరూ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎల్ భాస్కర్ తెలిపారు. పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రజలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాంటి వారికి తాము ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని తెలిపారు. అనంతరం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



పుంగనూరులో మందుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

పుంగనూరు: పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై బుధవారం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవి, తిరుపతి వ్యవసాయశాఖ సంచాలకులు ధనుంజయరెడ్డి, స్థానిక వ్యవసాయాధికారులు రాధా, జ్యోతమ్మ దాడులు చేశారు. స్టాక్, బిల్లులు, ధరల పట్టికలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఎరువులు, మందులు, విత్తనాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయించినా, బిల్లులు ఇవ్వకపోయినా, కృత్రిమ కొరత సృష్టించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు దుకాణాల్లో శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

సదుం: మండల కేంద్రమైన సదుంలోని ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాల్లో బుధవారం విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. స్టాకు వివరాలు, బిల్లు బుక్కులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను విక్రయించాలన్నారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తనిఖీ ప్రత్యేక అధికారి, అగ్రికల్చర్ ఏడీ ధనుంజయ రెడ్డి, విజిలెన్స్ సీఐ రవి, ఏఓ జ్యోత్స్న, ఏఈఓ ఖాదర్‌వలి పాల్గొన్నారు.

చంద్రుడిపై శ్రీరామచంద్రుడి అభయం



టి.పుత్తూరు కోదండ రామాలయంలో ఉయ్యాలసేవలో తరిస్తున్న సీతారామలక్ష్మణులు



చంద్రుడిపై శ్రీరామచంద్రుడి విలాసం

తవణంపల్లె: కోదండరాముడు చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మండలంలోని టి.పుత్తూరులో జరుగుతున్న కోదండరాములు దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి చంద్రప్రభ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉభయదారులు స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం చేయించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంకాలం ఉభయదారులచే చంద్రప్రభ వాహన సేవను భక్తితో నిర్వహించారు. ఉభయదారులు స్వామికి గజమాలలు, సుగంధ పరిమళ పుష్పాలతో పాటు పూజాసామగ్రి, ప్రసాదాలు, పండ్లు, వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు అభిషేకం, అలంకరణ, పూజలు చేయించి నైవేద్యం సమర్పించారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు వితరణ చేసి మొక్కులు తీర్చుకున్నారు.

చంద్రుడిపై శ్రీరామచంద్రుడి విలాసం

కోదండరామాలయంలో రాత్రిలో ఉభయదారులచే చంద్రప్రభ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజాసామగ్రి, రుచికరమైన ప్రసాదాలు, గజమాలలు, సుగంధ పరిమళ పుష్పాలు, పట్టువస్త్రాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. వేదపండితులచే స్వామివారికి అభిషేకం, పూజలు చేయించి నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. చంద్రుడిపై శ్రీరామచంద్రుడు కొలువుదీరి మాడవీధుల్లో తిరుగుతూ భక్తులను మైమరిపించారు. భక్తులు ఇంటింటా స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు పుష్పపల్లకి సేవ

కోదండ రామాలయంలో గురువారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్ సేవ జరుగుతుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్దేశ్వర రెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు. రాత్రిలో పుష్పపల్లకి సేవ వైభవంగా జరుగుతుందన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని ఉత్సవాలను తిలకించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.